# రగిలిన పగ

నేను క్లాసులో అడుగు పెట్టేసరికి నా సీట్లో ఒక అమ్మాయి కూర్చుని వుంది. నేరుగా వెళ్ళి నా డస్కు మీద పుస్తకాలు పెట్టుకుంటూంటే "ఇది నీ సీటా?" అంటూ పక్కకి జరిగిందా అమ్మాయి. ఆ పక్కసీటు అమ్మాయి పొద్దున్న రాలేదు. ఈ పూట వస్తుందో రాదో. నేను నా సీట్లో కూర్చున్నాను. మధ్యాహ్నం ఇంటి కెళ్ళని ఇద్దరు ముగ్గురబ్బాయిలు తప్ప క్లాసులో ఎవ్వరూ లేరు. ఆ అమ్మాయిని మాటల్లోకి దింపాను. "నువ్వు తొమ్మిదో క్లాసులోనే చేరతావా?" అని అడిగాను.

"అవును. ఎనిమిది పేసయ్యాను."

"నా పేరు సంపతి. నీ పేరేంటి?"

"సుబ్బలక్ష్మి."

వాళ్ళింట్లో అందరి పేర్లూ చెప్పింది. చెల్లెలి పేరు నాగలక్ష్మి. నాన్న పేరు భుజంగరావు. బాబాయి పేరు నాగేంద్రరావు.

"అమ్మ పేరు శేషమ్మ. మాకొక తాతమ్మ వుంది. అంటే మా నాన్నకి నాయనమ్మ అన్నమాట. ఆవిడ పేరు సీతమ్మ. అంతే, ఇంకెవ్వరూ లేరు" అంది.

"ఇంకా వుందా మీ తాతమ్మ? మీ తాతగారు లేరా?"

"లేరు. ఆయన్నసలు మేమెరగం. ఆయన పేరు సుబ్బయ్యగారు."

మేము మాటల్లో వుండగా క్లాసంతా నిండి పోయింది. ఫస్టు బెల్ కూడా ఐంది. అందరి దృష్టులూ, తనమీదే వుండటం చేత కొత్తమ్మాయి కాస్త సిగ్గు పడిందిగాని, నా అండన కొంచెం ధైర్యంగానే వుంది.

క్రమంగా నేను సుబ్బలక్ష్మికి మాష్టర్లను గురించి, స్కూలును గురించి, వివరంగా చెప్పాను. ఆ ఒక్క పూటలోనే మాకు పరిచయం ఎక్కువైంది. మిగిలిన అమ్మాయిలు సుబ్బలక్ష్మిని పల్కరించారు. టైమ య్యాక బైట కొచ్చేస్తూంటే "ఇవ్వాళ మా ఇంటికి రా సంపతీ. రేపు మీ ఇంటికొస్తాను" అంది స్నేహంగా. సరేనని నేను సర్దాగా బయల్దేరాను.

★ ★ ★

వాళ్ళింటికెళ్ళాక నన్ను హాల్లో కూర్చోబెట్టి సుబ్బ లక్ష్మి లోపలికెళ్ళింది. నేను హాలంతా కలియజూస్తున్నా. ఎక్కడ చూచినా రెండు సర్పాలు ఆడుతున్న ఫోటోలే. వీధి గుమ్మం కర్టెన్ మీద రెండు సర్పాలు! ఒకే ఆకా రంలో పడగలు విప్పుకొని! కృష్ణపాదాలు కనపడేలా ఆడుతున్నట్టు కుట్టి వుంది. హాలులో ఒక మూల మనిషెత్తుండే బల్లమీద పాలరాతితో చెక్కబడ్డ రెండు సర్పాల విగ్రహం వుంది! హాల్లోనుంచి లోపలికెళ్ళే గుమ్మంపైన గోడమీద రంగుల్తో ఒకే రకమైన సర్పాలు పెయింట్ చేయబడి వున్నాయి. నా దృష్టిపడ్డ చోటల్లా జంటసర్పాలే! నాకు ఏ నాగలోకంలోనో వున్నట్టనిపిం చింది. దీక్షగా కర్టెన్ వైపే చూస్తున్నా. అంతలో సుబ్బ లక్ష్మి వచ్చింది కాఫీ గ్లాసుతో.

"ఆ కర్టెన్ మీద నేనే కుట్టాను బాగుందా?" అంది, గ్లాసు టేబుల్ మీద పెడుతూ.

"మీరు నాగేంద్రుణ్ణి కొలుస్తారా? ఇంటినిండా జంట సర్పాలే వున్నాయేమిటి? క్లాసులో మీ అందరి పేర్లూ విన్నప్పుడు కూడా నాకు సందేహం కలిగింది కాని, పట్టించుకోలేదు. మీ పేర్లన్నీ నాగ సంబంధమై నట్టున్నాయి" అంటూ ఆశ్చర్యపోతూ అడిగాను.

"మేము తప్పనిసరిగా నాగేంద్రుణ్ణి పూజించా లట. పేర్లు కూడా అవే పెట్టుకోవాలట. లేకపోతే ఏదో అనర్థం జరుగుతుందని మా పెద్దవాళ్ళు చెప్తారు. ముందు నువ్వు కాఫీ తాగు. మా ఇల్లు చూపిస్తా" అంది.

"ఏం? నాగేంద్రుణ్ణి ఎందుకు పూజించాలి? పూజించకపోతే ఏం అనర్థం వస్తుంది?" అని అడిగా మళ్ళీ.

"ముందు కాఫీ తాగు, కావలిస్తే నీకు మా తాతమ్మ చెప్తుంది" అంది గ్లాసు అందిస్తూ.

నేను త్వరగా తాగేశాను. తర్వాత నన్ను సుబ్బలక్ష్మి లోపలికి తీసుకెళ్ళింది. లోపల గదుల్లో కూడా జంట సర్పాలాడుతున్నై. ముందు వాళ్ళమ్మని చూపించింది. "ఈ అమ్మాయేనమ్మా నా స్నేహితురాలు. ఈ అమ్మా యికి మన నాగేంద్రుడి కథ కావాలట" అంది సుబ్బ లక్ష్మి, వాళ్ళమ్మతో.

ఆవిడ నవ్వి "మనింటి కొచ్చిన వాళ్ళంతా ఇలాగే అడుగుతుంటారు కదా? తాతమ్మ దగ్గరికి తీసుకెళ్ళు. ఆవిడ ఓపిగ్గా చెప్తుంది" అని, "ఏమ్మా! నీ పేరు సంప

తని చెప్పిందిలే సుబ్బులు. అప్పుడప్పుడూ వస్తూండు" అంది.

ఆ తర్వాత సుబ్బులు నన్ను ఇంకో గదిలోకి తీసుకెళ్ళింది. ఆ గదిలో కిటికీ దగ్గిర మడత కుర్చీలో పండు తమలపాకులాంటి ముసలమ్మ కూర్చుని కిటికీలోంచి కాంపౌండ్‌లోకి చూస్తోంది.

సుబ్బలక్ష్మి ఆవిడ దగ్గరగా వెళ్ళి "తాతమ్మా, ఈ అమ్మాయి నా స్నేహితురాలే. మనిల్లు చూట్టాని కొచ్చింది" అంది.

తాతమ్మ నాకేసి చూస్తూ "రామ్మా, కూర్చో! నీ పేరేంటమ్మాయ్?..." అంది, పక్కనున్న నాలుక్కాళ్ళ పీటని నాకు చూపిస్తూ.

"నా పేరు సంపద లక్ష్మండీ" అంటూ కూర్చు న్నాను. "అలాగా? మంచిపేరే. మరేమో మా సుబ్బులు నూజివీడు నుంచి స్నేహితుల్ని విడిచి వచ్చేస్తోంటే ఏడిచింది. ఆ అమ్మాయిలికీ దీనికీ ఎంతో స్నేహం. పోనీలే. దీనికి నువ్వు దొరికావు. మీరు స్నేహంగా వుంటే అంత బెంగ వుండదు" అంది తాతమ్మ నన్ను చూస్తూ.

"తాతమ్మా! ఈ అమ్మాయికటా, మన నాగేంద్రుడి కథ కావాలట. తొందరగా చెప్పు" అంది సుబ్బులు.

"అలాగే చెప్తా. ఏం, నోరేమైనా అద్దెకు తేవాలా? అబ్బో! ఎంతమందికి చెప్పానో! ఇప్పుడా, అప్పుడా — నా పడుచప్పుడు జరిగింది. ఇప్పటికి సుమారు అరవై ఏళ్ళయ్యుంటుంది. మర్చిపోదామన్నా మరుపురాదు".

"చెప్పండి తాతమ్మగారూ!" అన్నా ఆతృత పట్టలేక.

తాతమ్మ ఒక తడిదగ్గు దగ్గి చెప్పటాని కుపక్ర మించింది. సుబ్బలక్ష్మి తాతమ్మ పక్కమీద పడుకుంది వింటానికి.

★ ★ ★

నేనూ, మా తోటికోడలూ ఎంతో సఖ్యంగా వుంటూ కోడరికం చేశాం మా అత్తింట్లో. ఈ కాలంలో తోటికోడళ్ళు అంత సఖ్యంగా వుంటారా? అబ్బో, మాకూ వీళ్ళకీ పోలికే లేదు. ఏ పని చేసినా కలిసి చేసుకునేవాళ్ళం. మా అత్తగారైనా మంచి మనిషే గానీ, కాస్త ఇరకతరకలుండకపోతాయా? ఐనా సర్దుకు పోవాలి. ఇంతకీ ఏమైందంటే, ఒకనాడు గోంగూర కోసుకొద్దామని మేమిద్దరం పెరట్లోకెళ్ళాం. అబ్బో! అప్పుడు మా పెరడు ఎంత వుండేదో! ఎన్ని రకాల పాదులు, మొక్కలు, తీగలు, చెట్లు వుండేవో! ఒక టేమిటి? ఒకవేపున ఆకుకూరలు. ఒకవేపున కాయ గూరలు. ఒక వేపున పూలమొక్కలు, ఇంకో వేపున పళ్ళచెట్లు. అబ్బే! ఎక్కడని చెప్పగలం? రోజూ పెరడు పనే సరిపోయేది"

నాకు అసలు సంగతేమిటో వినాలని ఆతృతగా వుంటంచేత, ఆ ఉపోద్ఘాతమంతా విసుగనిపించింది. నా విసుగు కనిపెట్టిన సుబ్బలక్ష్మి "అసలు సంగతి చెప్పు తాతమ్మా తొందరగా" అని తొందరచేసింది.

"అయ్యో, చెప్తున్నానా? అంత తొందర పనికి రాదమ్మాయ్. వినమ్మా నింపాదిగా" అంటూ తాతమ్మ మడత కుర్చీలో సర్దుక్కూర్చుని, ముందుకు వొంగి నన్ను తట్టుతూ చెప్పసాగింది — "ఇంతకీ ఏమైం దంటే, మేము బుట్టలోకి గోంగూరకోసి, ఆ మొక్కల దగ్గిరే పెట్టి, కాకరపాదు పిందిలేసిందేమో చూద్దామని ఇంకా పైకెళ్ళాం. కాస్సేపన్నీ చూసి తిన్నగా గోంగూర బుట్ట చంకనెట్టుకొని ఇంట్లోకొచ్చాం. మా తోటికోడ లేమో ఇంకో పనిలో జొరబడింది. నేనేమో గోంగూర బాగుచెయ్యటానికి నులకమంచం తెచ్చి, వసారాలో వాల్చి దానిమీద గోంగూరబుట్ట గుమ్మరించా. ఏ ఆకు కూరలైనా, నులకమంచం మీద వేసి దులిపి బాగు చేసేవాళ్ళంలే. ఆరగాకరకాయలైతే, నులకమంచానికి పెట్టి పాముతారు. నీకూ తెలిసే వుంటుంది. ఆ తర్వాతేం జరిగిందంటే, గోంగూరని మంచంనిండా విడదీసి ఒక్కో ఆకూ బాగుచేస్తున్నాను. అలా చూద్దునుగదా, రెండు నులకతాళ్ళలాంటి పాము పిల్లలు మంచం పట్టెలట్టుకుని పాకుతున్నాయి! నా ఒళ్ళు గరిపొడిచింది. భయం వేసింది. 'బాబోయ్' అని కేక పెట్టాననుకుంటా. ఆ పక్కనే గట్టుమీద కూర్చుని మా మరిదిగారు కవ్వంతాడు పేనుతున్నారు. ఆయన గభాల్న వచ్చి మంచం దగ్గిరిగా వంగి వాటిని చూట్టం మొదలెట్టారు. నాకేక విని మా అత్తగారూ, తోటి కోడలూ పరిగెట్టుకొచ్చారు.

"ఎలా వచ్చాయి వదినా ఇవి గోంగూరలోకి?" అని మా మరిది అడుగుతూంటే "ఇంకా చూస్తావేరా? వాటిని చంపెయ్యక? చిన్న పామునైనా పెద్దకర్రతో కొట్టమని శాస్త్రం. అయ్యో, అలా దగ్గిరిగా వంగకు" అని మా అత్తగారు కంగారుపడింది.

"గోంగూరబుట్టని కింద పెట్టినప్పుడు దూరాయి కాబోలు" అంది మా తోటికోడలు ఆశ్చర్యంగా. పాము

పిల్లలింకా ఇటూ అటూ పాకుతున్నాయి. మా మరిది గారికేం తోచిందో మరి ఇంట్లోకి పరుగెత్తుకెళ్ళి ఓ తాటాకుల బుట్టపట్టుకొచ్చారు. ఏం చేస్తారోనని మేము చూస్తున్నాం.

"వాటిని చంపెయ్యక, బుట్టెందుకురా?" అని మా అత్తగారు మళ్ళీ అరిచింది.

"చంపనే, పెంచుతాను" అంటూ మరిదిగారు ఆ బుట్టలోకి వాటిని ఎక్కించారు.

"అయ్యో! పాముల్ని పెంచటం ఏవిట్రా? విష ప్పురుగు! కుక్కనీ పిల్లినీ పెంచుకుంటారుగానీ, ఇదేం విడ్డూరం అబ్బాయ్? నీకేం చాదస్తమా? వాటిని చంపెయ్యి!" అంటూ అత్తగారు గోలపెట్టటం మొద లెట్టింది.

"అబ్బ, అంత భయమెందుకే? ఇవేం చేసేడు స్తాయ్? ఫర్వాలేదుగాని నేను పెంచుతాను జాగ్రత్తగా. మీకు భయమేస్తే దగ్గిరికి రాకండి" అని ఆయన బుట్టలో పాముల్ని అటూ ఇటూ తిప్పుతూ తిలకిస్తు న్నారు.

మేమెంతమందిమి ఎన్ని విధాల చెప్పినా విన లేదు. పోనీ చంపబుద్ధి గాకపోతే ఎక్కడైనా దూరంగా వదిలేసి రమ్మన్నాం. వినలేదు. ఈ విడ్డూరం విని ఊళ్ళో వాళ్ళంతా మా ఇంటికి ఎగబడేవారు. చూచే వాళ్ళు — కొందరు పెంచమనీ, కొందరు వదిలెయ్య మనీ, చెప్పేవారు. కాని, ఈయన ఎవరిమాటా విని పించుకునే వారుగాదు. ఇక ఆయన ఎంత మంది చెప్పినా వినిపించుకోరని చెప్పటం మానేశారు అందరూ".

అంతవరకూ చెప్పి తాతమ్మ కాస్సేపు ఆగింది.

సమయం చూసి "అసలు వాటిని ఎలా పెంచే వారండీ? కరిచేవిగావా?" అని అడిగా.

"చెప్తానుగా అమ్మాయ్. విను మరీ. ఆయన ఓపిక్కీ, ధైర్యానికీ ఆశ్చర్యపడాలి. సామాను గదిలో ఒక పక్క ఖాళీ చేయించేసి, అక్కడ వుంచేవారు. వీటి కోసం పెద్ద వెడల్పాటి బుట్ట ప్రత్యేకంగా అల్లించారు. దానికి చిన్న చిన్న చిల్లులుండేవి. కొన్నాళ్ళ వరకూ అందులోనే వుంచేవారు. రోజూ రెండు పూటలా పాలు పోసేవారు. మేము మాత్రం భయమేసి ఆ ఛాయల కైనా వెళ్ళేవాళ్ళంగాదు — మళ్ళీ వాటికోసం పెరట్లో కొంత మేర ఒక గాబులా తయారుచేశారు. శుభ్రంగా గాలీ వెల్తురూ లోపలికొచ్చేవి. సన్నటి తీగల్తో తయారు చేసిందిగదూ, వాటి సందులో పడేసి తలుపు బిగిం చేస్తే, ఇక అవి బయటికి రావటానికి వీలుండేదిగాదు. పైనకూడా తీగలమూత వుందికదూ, డేగలూ అవీ వచ్చేవిగావు. అవి అందులోనే కావలసినంత మేర తిరి గేవి. రోజూ సాయంత్రం పూట బుట్టలోంచి తీసి గాబులో కొదిలేవారు. ఈ విధంగా ఎంతో ఓపిగ్గా శ్రమపడితే కొన్ని నెల్లకి కొంచెం ఎదిగాయి. చెప్పటం మరిచా. వాటిలో ఒకదాన్ని సుబ్బయ్య అనీ, ఇంకో దాన్ని నాగయ్య అనీ పేర్లుపెట్టి పిలిస్తే అవి తలెత్తి చూసేవమ్మాయ్! మరిదిగారు వాటిని మీద మీద కెక్కించుకొంటూంటే మా ఒళ్ళు గరిపొడిచేది.

"ఏం భయం లేదు వదినా. ఇలా పట్టుకో" అని వాటిని మా దగ్గరికి తీసుకొస్తూంటే అంత దూరం పరిగెత్తి పోయేవాళ్ళం. మొదట్లో అంత భయపడే వాళ్ళమా. రాను రాను మాకూ అలవాటై, భయం పోయిందమ్మాయ్. కొంచెం కొంచెం దగ్గిరిగా కూర్చుని తోకల మీద చేతులేసి నిమిరేవాళ్ళం. అవి ఏమీ చేసేవిగావు, చేతుల మీద ఎగబాకేవి. ఒళ్ళు జలద రించేది. అవి రాను రానూ బుట్టలో మానేసి ఇంట్లోనే తిరిగేవి. గాబులో వదలటం కూడా మానేశాం. అవి తిన్నగా పెరడంతా తిరిగేవి. "సుబ్బయ్యా, నాగయ్యా, ఎక్కడా? ఇలా రండి" అని పిలిస్తే ఎక్కడున్నా సరే జరజరా పాక్కుంటూ వచ్చేసి పడగలెత్తి "ఎందుకు పిలిచావు?" అని అడుగుతున్నట్టుగా నిలబడేవి. "చీకటిపడిపోవటంలా? రండిక" అని కోప్పడి లోపలి కొచ్చేస్తూంటే తప్పుజేసి భయపడుతున్నట్టుగా, నెమ్మ దిగా పాకుతూ వెనకబడేవి. పాలుపోస్తే తాగేసి పడు కోటానికి ఇంటి చూరులెక్కేవి. మా ఇంటి దూలాలు పెద్దవిగా వుండేవికదూ, వాటి మీద పడుకునేవి. అవి, బాగా ఇంటిల్లపాదికీ అలవాటుపడిపోయాయి. మా పాలేళ్ళకి కూడా బాగా మచ్చికైపోయాయ్. మనుషుల్లో మనుషుల్లా మెలిగేవమ్మాయ్, వాటి విషపు గుణం ఏమైపోయిందోగాని" అంది తాతమ్మ నన్ను తట్టుతూ.

"మరి పెంపుడు కుక్క వుంటేనే ఎవరైనా ఇంటికి రావటానికి భయపడ్తారు గదా? అప్పుడు మీ ఇంటి కెవరైనా వచ్చేవారాండీ?" అన్నా.

"నువ్వన్నట్టు మా ఇంటికి రావటానికందరూ భయపడే వాళ్ళు. వీధిలో నిలబడి పిలిస్తే, మేము వెళ్ళి వాళ్ళని లోపలికి తీసుకొచ్చే వాళ్ళం, ఒకనాడేం జరిగిం దంటే, నాగయ్యా, సుబ్బయ్యా, పెరట్లో తిరుగు

తున్నాయి. మేము వంటింట్లో పని చేసుకుంటున్నాం. ఒక పాములవాడు నాగస్వరం ఊదుతూ పాముని ఆడించటానికి తీసుకొచ్చాడు. ఆ నాగస్వరం వినపడ గానే సుబ్బయ్యా, నాగయ్యా పెరట్లోనించి జరజరా పాక్కుంటూ సరాసరి వీధిలో కెళ్ళిపోయాయి. వీటిని చూచి పాములవాడి దగ్గిర పాము బుట్టలోంచి బైట పడి వీటితో కలిసిపోయింది. పాములాడికి కంగారెత్తి నాగస్వరం మానేసి నోరెళ్ళబెట్టి చూస్తున్నాడు. ఆ పాముల్ని మేం పెంచుతున్నామని వాడికేం తెలుసు? వాడి చుట్టూ చేరిన పిల్లలు గోలగోలగా అరవటం మొదలెట్టారు. మేమంతా చావిట్లో కొచ్చి చూస్తే ఇలా వుంది భాగోతం, సమయానికి మా మరిదిగారు ఇంట్లోనే వున్నారు. ఆయన కూడా బయటకొచ్చి, చూచి వాటిని కోప్పడ్డారు. వాటికేసి తీక్షణంగా చూస్తూ "ఏం నాగయ్యా, మతిపోయిందా? ఇలా ఎగబడ్డారేం? భయభక్తులు లేకుండా పోతున్నాయనుకుంటా. సుబ్బయ్యా! తిన్నగా గాబులోకి పొండి. వెళ్ళండీ" అంటూ గద్దించేసరికి, అవి గజగజా వణికిపోయి, నెమ్మదిగా చావిడి పక్క వరండాలో నించి పెరటిలోకి పోయి గాబులో జొరబడ్డాయి. పాములాడి పాము కూడా వాటి వెంట గాబులో దూరింది. ఆ తర్వాత వాడు గాబు దగ్గిరికొచ్చి తన పాముని తీసి బుట్టలో పెట్టుకున్నాడు. అప్పట్నించీ వాటికి నాగస్వరమంటే ఇష్టమని తరుచూ పాములాళ్ళచేత వాటి దగ్గర కాస్సేపు ఆ స్వరం పాడించేవారు. అలాగ పగలు నానా అల్లరీ చేసి, రాత్రుళ్ళు ఏ కాస్సేపు పడుకొనేవో ఏమో, మళ్ళీ మా కన్నా ముందే లేచిపోయేవి. తొలికోడి కూశాక మా మరిదిగారు లేచి మొహం కడుక్కుని పాలు తియ్యటానికి దూడల దొడ్లోకెళ్తే, ఇంటిదగ్గిరే పడుకునే పాలేరు ఆయన వెనకాల బిందెల కావి డేసుకుని వెళ్ళేవాడు. అబ్బో, అప్పుడు మా దొడ్డినిండా పాడి పశువులే. రోజూ రెండు పూటలా రెండేసి బిందెల పాలిచ్చేవి! అన్నీ మేం తాగేవాళ్ళమా? లేదు. ఇంటిలో వాడకానికి ఓ బాన. బాటసారులకి దాహం ఇవ్వ టానికీ, మాల మండోళ్ళడిగితే పొయ్యటానికీ ఇంకో బానా, ఎప్పుడూ పాడితో పూరుతూ వుండేవి. ఈ రోజుల్లో లాగా ఆనాడు పాడి అమ్ముకుంటే వేలు సంపాదిద్దుమమ్మాయ్. ఎర్రగా మగ్రివూడల్లా కాచే సరికి అరిచేతి మందాన మీగడ కట్టుకొచ్చేది. మజ్జిగ చేసేసరికి వీశ రాళ్ళంతంత వెన్నముద్దలయ్యేవి. అప్పుడు మా ఇంట్లో, ఇద్దరు శూద్రపాలేళ్ళుండే వాళ్లే. వాళ్ళే మలికోడి కూశాక వచ్చి, చెరొక బానా మజ్జిగ చేసేవాళ్ళు. అంతంత బానలు చెయ్యటం ఆడవాళ్ళం మా వల్ల నౌతుందా? ఆఁ, ఇంతకీ ఏం చెప్తున్నానూ? పాల కబురుకాదూ? మలికోడి కూసేసరికి పాలు తియ్యటం అయిపోయేది, ఇంటికి రాగానే సుబ్బ య్యనీ, నాగయ్యనీ పిలిచి పాలు పోసేవారు. సరిగ్గా ఆ వేళకి, పేర్లు పిలిచిందే తడవుగా చూరుల్నించి దిగివచ్చి పాలుతాగి పెరట్లోకి పోయేవి.

మేమంతా ఆనందంగానే కాలం గడిపే వాళ్ళం గానీ, పెళ్ళిళ్ళయి నాలుగేసేళ్ళవుతున్నా, మాకు పిల్లలు పుట్టడంలేదని, మా అత్తగారికి మాత్రం చాలా దిగులు గానే వుండేది. పాముల్ని బంధించి పెంచిన పాపానికి, పిల్లలు పుట్టటం లేదనే వాళ్ళు కొంతమంది. కానీ మేము తల్లీ పిల్లా న్యాయంగా వుండే వాళ్ళంగానీ, వాటికేం చెరుపు చెయ్యలేదుగా?

కాలం గడుస్తున్నకొద్దీ అవి ముసలివైపోయాయి. ఒక్కోటీ, రెండేసి బారల పొడుగునా, ఇంతేసి లావునా, నల్లగా, ముడతలుబడిపోయి వుండేవి. ఉత్సాహ మంతా చచ్చిపోయినట్టు మందకొడిగా వుండేవి. రాత్రుళ్ళు పాలు తాగేక, చూరులెక్కటానికి జవసత్వా లుడిగిపోయాయి గదూ మహా ప్రయాసపడేవి. అది కనిపెట్టి మా మరిదిగారు వెడల్పాటి బల్ల చెయ్యమని వడ్లాబత్తుడికి పురమాయించారు. కాని ఇంతలోనే అంత ఘోరం జరిగిపోయింది!" అని ఆగింది తాతమ్మ.

ఆవిడ మొహంలో కన్పించిన విచారాన్నిబట్టి, అదేదో ఘోరమే అయ్యుంటుందని అనుకున్నాను.

"చచ్చిపోయాయాండీ?" అనడిగా.

"అయ్యో! వాటికవి చచ్చిపోతే ఇంకేమమ్మాయ్? చేతులారా చంపుకున్నాం. వాటి ఉసురు మాకు తగి లింది. అదే ఏమైందో చెప్తా విను! రోజూలాగే ఆ రోజున కూడా మలికోడి కూసేసరికి మరిదిగారు పాలు తీసుకొచ్చారు. యథాప్రకారం 'నాగయ్యా,సుబ్బయ్యా' అంటూ రెండు మూడుసార్లు పిలిచారు. అవి చూరు ల్నించీ పాకి రాలేదు! మళ్ళీ పిలిచినా ఎక్కడా కదులు తున్నట్టయినా అలికిడవలేదు. మాకాశ్చర్యం వేసింది. పెరట్లో కెళ్ళాయేమోనని పెరడంతా పొలిబొబ్బలు పెడుతూ తిరిగారు. ఎక్కడా లేవు, 'ఏమిటిది? విచి త్రంగా వుంది. ఎక్కడికెళ్ళాయి?' అనుకుంటూ ఆయన

అటకంతా గాలించారు. మేము ఇల్లంతా అడుగడుగునా వెతికాం. ఎక్కడా అయిపులేవు. మాకందరికీ తెగ ఆశ్చర్యం వేసింది. పైగా వాటికేం ఆపద సంభవించిందోనని కంగారు పడిపోయాం. కొన్నేళ్ళనించీ వుంటున్నవి ఈనాడేమై పోయాయా అని దిగులుగా 'ఎక్కడికైనా వెళ్ళాయేమో. కాస్సేపటికో, ఇంకాస్సేపటికో వస్తాయేమో' అని ఆశతో ఎదురుచూస్తూ ఎవరి పనులు వాళ్ళు చేసుకుంటున్నాం. మరిదిగారింకా పేర్లెట్టి పిలుస్తూ వెదుకుతున్నారు చుట్టుపట్ల. ఎప్పుడూ వాటి ప్రసక్తిలేని మా ఆయనక్కూడా దిగులేసింది వాటి సంగతి తెలియకపోయేసరికి.

ఇదిలా వుండగా మజ్జిగ చెయ్యటానికి గదిలో కెళ్ళిన పాలేళ్ళిద్దరూ గావుకేకలెట్టారు. ఎక్కడి వాళ్ళం అక్కడ నించి ఆ గదిలోకి పరుగెత్తాం. అంతా కలిసి అప్పుడు మా కళ్ళతో ఏం చూశామో, ఈ క్షణానికీ కళ్ళకి కట్టినట్టుంది! ఆ పాలేళ్ళిద్దరూ వణికిపోతున్నారు. పెరుగు బానలూ రెండూ గట్టుపక్కన దించి వున్నాయి. ఆ గట్టుమీద రెండు చోట్ల రెండు చితికిపోయిన మాంసపు ముద్దల్లా నాగయ్యా, సుబ్బయ్యా పడి వున్నాయి, మాకా దృశ్యం చూసేసరికి ఒళ్ళు జలదరించింది. "అసలేం జరిగింద"ని పాలేళ్ళని అడిగితే, "మాకేం తెలీదయ్యా. మజ్జిగ చేద్దామని పెరుగు బానలు దించబోతే ఎంతకీ వూడిరాలేదు. గట్టిగా లాగి కిందబెట్టాం. అంతే. మాకూ ఇలాగే కనపడింది. భయమేసి కేకలెట్టాం" అన్నారు వాళ్ళు. అంటే రాత్రినుంచీ అవి, బానలకింద వుండిపోయాయన్నమాట! రాత్రి రోజూలాగా పాలు తాగేసి, చూరులెక్కలేక, పాలబానలు పెట్టే గుంటల్లో గట్టుమీద చుట్టలుచుట్టుకుని పడుకున్నాయి కాబోలు. పొరపాటున సరిగ్గా చూడక, మర్రివూడల్లా ఎర్రగా, సలసలా కాగిన పాలబానల్ని పాలేళ్ళు పాము చుట్టలమీద పెట్టేశారు. అబ్బా! ఎంత బాధపడ్డాయో! కదల్లేవు, మెదల్లేవు. పైన అగ్నిగోళాల్లాంటి పాల బానలు! భరింపరాని బాధకదా? అవి బాధపడ్డ ప్రతిఘడియా, ఏళ్ళై వూళ్ళై మమ్మల్ని పీడించింది. "ఇదంతా నా నిర్లక్ష్యమే, చేతులారా చంపుకున్నాను నా నాగయ్యనీ, నా సుబ్బయ్యనీ. అందరి దగ్గరా చనువుగా మెసలుతున్నాయి గదా అని వాటి గురించి పట్టించుకోటం మానేశాను. వాటిని నా పొట్టన పెట్టుకున్నాను. ఆనాడే పెంచకుండా వదిలేస్తే, అంత యమయాతన పడేవి కాదుగదా?" అంటూ మరిదిగారు భోరున ఏడ్చారు. కొంతసేపయాక దుఃఖం మింగుకుని "రాత్రి బానలెవరు పెట్టార్రా? కళ్ళు మూతలుబడి పోయాయా?" అని ఉగ్రనరసింహుడి లాగ గర్జించారు.

రాత్రి బానలు పెట్టిన వాళ్ళకీ విషయం తెలిసి పరుగుపరుగున వచ్చి వాళ్ళు చేసిన ఘోరం చూచుకుని పసిపిల్లల్లా ఏడ్చారు. ఆముదం దీపం గుడ్డి వెల్తుర్లో సరిగ్గా కనిపించలేదట. అసలే నల్లగా వున్న పాములు. అందులో మట్టిగట్టు. లేకపోతే మా చేతుల్తో ఇంత ఘోరం చెయ్యగలమా అయ్యా? అంటూ వాపోయారు. వాళ్ళనేమనగలం? అంతా ఖర్మ. లేకపోతే రోజూ చూరులెక్కి పడుకునేవి ఆనాడు ఎక్కలేక పోవాలా? గట్టు పక్కనున్న పెరుగుబానలు చూద్దుము గదా, పచ్చగా పసర్లు కక్కుతోంది పెరుగు. జీవిత కాలంలో ఎప్పుడూ బయటపడని విషం, అగ్ని గోళాల కింద యమబాధపడుతున్నప్పుడు బయట పడిందేమోననిపించింది. ఆ మూగ బాధలో ఎన్ని శాపనార్థాలు పెట్టాయో మమ్మల్ని! బతికినంతకాలం ఎంత దయగా చూస్తేయేం? ఆఖరికి పేరు నిలబెట్టుకోలేక పోయాం. ఈ సంగతి ఊరంతా పాకి జనం నేల ఈనినట్టు వచ్చి మా ఇల్లు చుట్టుముట్టారు. ఇక ఎంతసేపు విచారిస్తే మాత్రం ఏముంది? జరగవలసిందో, జరగకూడనిదో జరిగిపోయింది. గుండె నిబ్బరం చేసుకుని ఆ పాము శరీరాలకి దహనం చేసే ఏర్పాట్లు చేయించారు మా ఆయన. పూల బండిమీద వూరేగించి, గంధం చెక్కల చితిమీద పెట్టి మా మరిదిగారు చితి అంటించారు. దహనం అయ్యాక అంతా ఇంటికొచ్చి పెరుగు బానల్ని ఆ గదిలోనే లోతుగా పాతిపెట్టించారు. అవి చచ్చిపోయినచోట రెండు కంచు విగ్రహాలు ప్రతిష్ఠించాలని పురమాయించారు. మేమంతా మైల పట్టాం. ఇంట్లో నాగయ్యా, సుబ్బయ్యా అనే మనుషులు పోయినట్టుగానే చిన్న దినం, పెద్ద దినం, సంవత్సరీకం చేయించాలన్నారు. అలాగే చేయించారు. మేము కొన్నాళ్ళ వరకూ మనుషుల్లో పడలేదు. చెప్పటం మరిచా. ఆ రోజున పాలబానలు పెట్టిన వాళ్ళల్లో ఒకడు మనేది పెట్టుకొని, చెయ్యరాని పని చేశానని భయపడి మంచంపట్టి చచ్చిపోయాడు; ఇంకొకడు పొలం గట్లమ్మట తిరుగుతుండగా నాగుబాము కరిచి యమబాధపడి నిమిషాల మీద ఎగిరిపోయాడు. అటు తర్వాత మా బాధలు బయటపడ్డాయి" అంటూ

చెప్పుకుపోతున్న తాతమ్మని ఆపాను.

"తాతమ్మగారూ, ఒక్క సంగతి. పాలబానలు గట్టుమీద పెట్టేశాక 'తోడంటు' వేసేవారా?" అని నా సందేహం అడిగాను.

ఆవిడ తలపంకించి "అవునమ్మాయ్, సూర్యాస్త మయం అవుతోంటే పశువులు పొలాల్నుంచీ దొడ్డి కొచ్చేసేవి. వెంటనే పాలు తీసి, ఇంటికి తెచ్చి దాళ్ళు వేసి కాగబెట్టేవారు. అంతలోకే మరిదిగారు సుబ్బ య్యకీ, నాగయ్యకీ పాలు పోసేవారు. అవి ముసలివ వటంచేత పాలు తాగిన వెమ్మటే పడుకోవటానికి వెళ్ళి పోయేవి. పాలు బాగా మరిగాక పాలేళ్ళు, పాలబానల్ని గదిలో పెట్టేసి, మిగతా పని చేసుకునేవారు. అప్పటికి కనుచీకటిపడేదంతే. అటుతర్వాత, మగాళ్ళ స్నానాలూ భోజనాలూ అయ్యాక, మేము స్నానాలు చేసి, కబుర్లాడుకుంటూ తిళ్ళు తిని వంటిల్లు సర్దుకుని, చావిట్లో కొచ్చేవాళ్ళం. సరిగ్గా పడుకొనేసరికి, ఈ రోజుల్లో లెక్కప్రకారం తొమ్మిది దాటేదనుకుంటా. అప్పటికి పాలు చల్లారుతాయని మా అత్తగారు తోడంటు వేసి వచ్చి పడుకునే వారు. ఆనాడు కూడా ఆవిడ తోడంటు పెట్టి వచ్చారుగాని, బానల కిందవున్న వాటినెలా చూడగలరు?

అటు తర్వాతేం జరిగిందో చెప్తా విను — మేము నెమ్మదిగా విచారం మర్చిపోతున్నాం. నాకూ, మా తోటికోడలికీ కూడా నెలలు తప్పాయి. ఇంట్లో మళ్ళీ అందరి మొహాల మీదా ఆనందం కనపడింది. పెళ్ళయిన ఎన్నాళ్ళకో సంతానప్రాప్తి! ఎవరికి వాళ్ళం ఎన్నెన్నో కలలుగనే వాళ్ళం. కాని, మా కలలన్నీ కల్లలై పోయాయి. మాకిద్దరికీ పుట్టిన పిల్లలు గుడ్డివాళ్ళు. వాళ్ళయినా బతక్కుండా పురిట్లోనే పోయారు. అటు తర్వాత మళ్ళీ సంతానమంతా అలాగే వుండేది. అలా కొన్నేళ్ళు ఇంటిల్లిపాదిమీ కుమిలిపోయాం. కానీ, ఏం చెయ్యాలో తెలిసేది గాదు. ఎవరో పెద్దలు చెప్పిన మీదట 'నిత్యా నాగయ్యనీ, సుబ్బయ్యనీ పూజచేసు కొంటామనీ, మా తప్పులు మన్నించి కనికరించమనీ' నాగయ్యా, సుబ్బయ్యా కంచు విగ్రహాల ముందు మోకరిల్లి వేడుకున్నాం. వాళ్ళు మమ్మల్ని క్షమించారని అనుకున్నాం. అప్పుడు మా గర్భాలు నిలిచాయి. మా అబ్బాయి పేరు సుబ్బయ్య. సుబ్బులుకి తాత. ఆ మీదట మా వంశంలో వారందరి పేర్లూ అవే. సుబ్బులు తల్లిపేరు పెళ్ళవకముందు ఏదో వుండేది గాని, మార్పించాం. ఆనాడు జరిగిన కథనిలా చెప్ప టానికి నేనూ, మా తోటికోడలూ బతికివున్నాం అంతే. పాములు కనపడితే మేమెప్పుడూ చంపము. ఇదీ మా నాగేంద్రుడి కథ" అని తాతమ్మ వెనక్కి జార్లాబడింది.

తాతమ్మ చెప్తున్నంతసేపూ నాకు వివిధాను భూతులు కలిగాయి. నిజంగా జరిగిందా? అని సందేహం కలిగినా నమ్మాను. కిటికీలోంచి బయటికి చూచేసరికి చీకటిపడుతోంది. సుబ్బులుకేసి చూశాను. నిద్రపోతోంది.

"అది చాలాసార్లు విన్నదిలే" అంది తాతమ్మ.

నేను తట్టేసరికి సుబ్బులు లేచింది. "తాతమ్మ గారు చెప్పటం అయిపోయింది. పొద్దుపోతోంది, వెళ్తా" అన్నా.

"ఇట్టే నిద్రపట్టేసింది" అనుకుంటూ సుబ్బలక్ష్మి హాల్లోకి నడిచింది. నేనూ వెంబడించా. మళ్ళీ జంట సర్పాల ఫొటోల్ని తదేకంగా చూశా. వాటి మీద నాకు అదో విధమైన ప్రేమా, సానుభూతీ కలిగాయి. కర్టెన్ మీద జంట సర్పాలు నన్ను దీవిస్తున్నట్టుగా తల లూపాయి గాలికి.

"మీ ఇంటికి వచ్చినందుకు చక్కటి గాథ తెలిసింది. మా వాళ్ళందరికీ చెప్తా" అని వచ్చేశాను గబగబా.

[5-3-58 తేదీ ఆంధ్రవారపత్రిక నుంచి] ★

## ఈ కథ గురించి:

మా అమ్మ చిన్నతనంలో, వాళ్ళ ఊళ్ళో ఈ సంగతి జరిగిందని చెప్పేది. అప్పుడు ఈ మహిమలన్నిటినీ నిజంగానే నమ్మాను. ఆ ఊళ్ళో, ఒక ఇంటి వాళ్ళు, పాముల్ని పెంచితే పెంచి వుండవచ్చు. అవి ఏదో ప్రమాదంలో చచ్చిపోతే చచ్చిపోయి వుండవచ్చు. కానీ, ఆ తర్వాత జరిగిన మహిమల సంగతి ఏమిటి? అవి నిజాలు అవవుకదా? తర్కంతో ఆలోచించడం తెలియకపోతే మనుషులు ఎంత మూర్ఖత్వంలో వుంటారో చెప్పడానికి ఇది ఒక సాక్ష్యం. లక్షకి ఒకరో ఇద్దరో తప్ప మిగిలిన వాళ్ళందరూ 'నాగేంద్రుణ్ణి' నమ్మే అజ్ఞానంలోనే వుంటారు. నేను ఆ అజ్ఞానంలోంచి బైటపడితే మాత్రం, తోటి జనం అంతా అలాంటి మూఢనమ్మకాల్లోనే వుండిపోతే, అలాంటి సమాజంలో జీవించడం ఏం సంతోషాన్నిస్తుంది?

25-6-2004